క్లుప్తంగా

ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలి


అవగాహన కల్పిస్తున్న శిక్షకులు

గంభీరావుపేట: పదో తరగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకొని మంచి ఫలితాలు సాధించాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, లయన్స్ క్లబ్ జిల్లా అడిషనల్ కార్యదర్శి బుర్ర మధుసుదన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్‌లో లయన్స్ క్లబ్ మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు పరీక్షల ప్రిపరేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. సమయాన్ని వృథా చేసుకోకుండా మంచి లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని చదువుకోవాలన్నారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లక్కిరెడ్డి సంతోష్‌రెడ్డి, కోశాధికారి కిషన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు ముగిసిన శిక్షణ


శిక్షణ పత్రాలు అందిస్తున్న ప్రిన్సిపాల్

గంభీరావుపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు తొలిమెట్టు దిశా నిర్దేశ శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. శిక్షణ పొందిన వలంటీర్లకు ధ్రువీకరణ పత్రాలను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి.విజయలక్ష్మి, వైస్‌ప్రిన్సిపాల్ పిట్ల దాసు చేతుల మీదుగా అందించారు. శిక్షణ పొందిన వలంటీర్లు తమకు కేటాయించిన ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు పాఠాలు బోధించాల్సి ఉంటుందన్నారు. ప్రాథమిక విద్య చదువుతున్న విద్యార్థులకు చదవడం, రాయడం వంటి నైపుణ్యాలను పెంచే విద్య నేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రొగ్రాం ఆఫీసర్ పాక ధర్మపురి, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ శ్రీవల్లి, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కో–ఆర్డినేటర్ వాణి, అధ్యాపకులు విష్ణు, శ్రావణ్, బిక్షమయ్య, శ్రీనివాస్, మనోహర్ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలి


మాట్లాడుతున్న ముస్తాబాద్ ఎస్సై శేఖర్‌రెడ్డి

ముస్తాబాద్/రుద్రంగి: అసెంబ్లీ ఎన్నికల నియమావళి అమలు, నియమ నిబంధనలపై ముస్తాబాద్, రుద్రంగి పోలీస్‌స్టేషన్‌లలో ఎస్సైలు శేఖర్‌రెడ్డి, రాజేశ్ అన్ని రాజకీయ పార్టీల బాధ్యులతో శుక్రవారం సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ఒకరిపై ఒకరు దూషించుకోవడం, ఎదురు పడితే కవ్వించడం వంటి పనులు చేయవద్దన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే ఎన్నికల సంఘానికి, సీ–విజిల్‌కు సమాచారం ఇవ్వవచ్చన్నారు. సామాజిక మాధ్యమాల్లో ఒకరిపై ఒకరు రెచ్చగొట్టే పోస్టులు పెట్టవద్దని, అలాంటి పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధలను పాటిస్తూ 30న ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు సహకరించాలని కోరారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బోనమో పోచమ్మ

ముస్తాబాద్: మండలంలోని గూడెం గ్రామంలో పోచమ్మ ఆలయ పునః ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం మున్నూరు కాపు సంఘం, మేర, పూసవేర్ల సంఘాల ఆధ్వర్యంలో దప్పు చప్పుళ్ల మధ్య వందల కుటుంబాలకు చెందిన ఆలయానికి మహిళలు తరలివెళ్లి బోనాలు సమర్పించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి, ఊరు సల్లంగా చూడాలని వేడుకున్నారు. ఆలయ కమిటీ బాధ్యులు లింగంపల్లి ఎల్లాగౌడ్, ఎంపీటీసీ బొప్ప శ్రీధర్, బొప్ప నర్సయ్య, జిల్లెల్ల మల్లేశం, బాలమల్లు, ఓదెలు, శ్రీను, నాయకులు పాల్గొన్నారు.



బస్ సౌకర్యం కల్పించరూ..

- కరీంనగర్–బోయినపల్లి రూట్ బస్సులు బంద్
- ప్రయాణికుల ఇబ్బందులు
- ఉద్యోగులు, వ్యాపారుల అవస్థలు

బోయినపల్లి: మండల కేంద్రానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. బోయినపల్లి నుంచి కరీంనగర్, వేములవాడ, గంగాధర తదితర ప్రాంతాలకు గతంలో నడిచిన ఆర్టీసీ బస్సు సేవలు ఏడాది కాలంగా నిలిపివేశారు. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. కరీంనగర్ నుంచి వయా బావుపేట, నాగుల మల్యాల, విలాసాగర్, బోయినపల్లి గ్రామాల మీదుగా వేములవాడ, నూకలమర్రి వరకు ఒక బస్సు కరీంనగర్, కొత్తపల్లి, కురిక్యాల, గర్శకుర్తి, బోయినపల్లి, వేములవాడ మీదుగా సిరిసిల్ల వరకు మరో బస్సును కరీంనగర్–1 డిపో నుంచి నడిపే


ఆటోలో ఎక్కుతున్న ప్రయాణికులు

వారు. కోవిడ్ సమయంలో లాక్‌డౌన్‌తో బస్సు సౌకర్యం నిలిపివేశారు. అనంతరం కొంతకాలం నడిపి, తిరిగి సుమారు ఏడాదిగా బస్సులు నిలిపివేయడంతో ప్రయాణికులు తంటాలు పడుతున్నారు.

ప్రయాణికుల ఇబ్బందులు

కరీంనగర్–బోయినపల్లి, వేములవాడ బస్సులతో ముఖ్యంగా కళాశాల విద్యార్థులకు, ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారవర్గాల వారికి ఎంతో సౌకర్యంగా ఉండేది. కరీంనగర్ నుంచి బోయినపల్లి మీదుగా వేములవాడకు గంటకో బస్సు ఉండేది. చాలా కాలంగా బస్సు సేవలు నిలిచిపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రానికి ఉదయం, సాయంత్రం ఒక్క కరీంనగర్–అనంతపల్లి బస్సు, అలాగే సిరిసిల్ల డిపో నుంచి వేములవాడ, బోయినపల్లి, గంగాధరల మీదుగా మంచిర్యాల, బెల్లంపల్లికి మరో బస్సు మాత్రమే వెళ్తాయి. ఈ రెండు బస్సులు తప్ప మరో బస్సు లేక ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. కరీంనగర్‌కు వెళ్లి చదువుకునే కళాశాల విద్యార్థులు, ఉద్యోగులు కరీంనగర్–బోయినపల్లి డైరెక్టు బస్సు లేక, అటు గంగాధర లేదా ఇటు కొదురుపాకకు వచ్చి బోయినపల్లికి రావడానికి తిప్పలు పడుతున్నారు. కరీంనగర్–1 డిపో నుంచి బోయినపల్లి, వేములవాడకు బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నం



గతంలో బోయినపల్లి, వేములవాడ, కరీంనగర్ బస్సులు నడిచినపుడు సౌకర్యంగా ఉండేది. టేలరింగ్ సామగ్రి కొనుక్కొని త్వరగా ఇంటికి వచ్చే అవకాశం ఉండేది. బస్సులు నడవకపోవడంతో అవసరాలకు వేములవాడ, కరీంనగర్ వెళ్లడం, రావడం ఇబ్బందిగా ఉంది.
– మాడిశెట్టి శ్రీనివాస్, టైలర్, బోయినపల్లి

కోవిడ్ నుంచి బస్సులు బంద్



కోవిడ్ ఉధృతి ఉన్న సమయంలో బస్సులు బంద్ చేశారు. తర్వాత ఏడాది కిందట కొద్ది రోజులు బస్సులు నడిపారు. మళ్లీ ఏమైందో ఏమోకాని అర్ధాంతరంగా బస్సులు పూర్తిగా బంద్ చేశారు. ప్రజలు దిక్కులేక ప్రైవేటు వాహనాల్లో ప్రయాణిస్తున్నారు.
– మెరుపుల గంగాధర్, బోయినపల్లి

ఏడాదిగా బస్సుల జాడ లేదు



ఏడాదికాలంగా బస్సులు నడవడం లేదు. ఉదయం వేళ బస్ మిస్ అయితే ఆపద సమయంలో ప్రైవేటు వాహనాలు కిరాయికి తీసుకుని వెళ్తున్నారు. ఆర్థికంగా లేని వారికి ఆపద వస్తే ఇబ్బందే. ఈ రోజుల్లో సైతం ఆర్టీసీ బస్సులు రాకపోవడం విచిత్రంగా ఉంది.
– నల్ల మోహన్, బోయినపల్లి

నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తాం

- వేములవాడ బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు


అనుపురంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు

వేములవాడఅర్బన్: మిడ్‌మానేరు నిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తామని వేములవాడ బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. వేములవాడ మండలం అనుపురం, గుర్రంవానిపల్లి గ్రామాల్లో శుక్రవారం గడపగడపకు ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో ప్రారంభమైన మిడ్‌మానేరు ప్రాజెక్ట్ నిర్మాణాన్ని పెండింగ్‌లో పెట్టి, నిర్వాసితులకు సరైన ప్యాకేజీ ఇవ్వకుండా నిండా ముంచిందన్నారు. కష్టాల్లో ఉన్న నిర్వాసితులను ఆదుకున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిది అన్నారు. రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ప్రాజెక్టును పూర్తి చేసి, నిర్వాసితులకు న్యాయం చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమని ఆయన అన్నారు. మరో రూ.28 కోట్లు కేటాయిస్తే ముంపు గ్రామాల్లోని సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. అనుపురంలోని బేడబుడగజంగాల వాసులకు దళితబంధు, నాన్ నోటిఫైడ్ ఇళ్ల పట్టాలను ఇప్పించడంతోపాటు గుర్రవానిపల్లి గ్రామంలోని సమస్యలు ఆరు నెలల్లో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, ఎంపీపీ బూర వజ్రమ్మ, జెడ్పీటీసీ మ్యాకల రవి, పార్టీ మండలాధ్యక్షుడు ప్రవీణ్, సెస్ డైరెక్టర్ హరిచరణ్‌రావు, వైస్‌ఎంపీపీ రవిచందర్‌రావు, సర్పంచులు కొండపల్లి వెంకటరమణారావు, గుర్రం లక్ష్మారెడ్డి, ఉరడి రాంరెడ్డి, రేగులపాటి రాణి, మెరుగు శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

ఆపదలో అండగా నిలిచిన చల్మెడ

వేములవాడ మండలం గుర్రంవానిపల్లికి చెందిన వంగపల్లి లక్ష్మి మనుమడు అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న చల్మెడ వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. చిన్నారి పరిస్థితి చూసి చలించి, తక్షణ ఆర్థికసాయం అందించారు.

బీఆర్ఎస్‌లో చేరిన ఉపసర్పంచ్

వేములవాడ మండలం చంద్రగిరి ఉపసర్పంచ్ పెండ్యాల అశోక్ కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో


మామిడిపల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు

చేరారు. ఆయనతోపాటు మరో 100 మంది గ్రామస్తులకు గులాబీ కండువా కప్పుకున్నారు.

చల్మెడకు కురుమ యాదవ సంఘం మద్దతు

వేములవాడ: అసెంబ్లీ ఎన్నికల్లో తమ సంపూర్ణ మద్దతు బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావుకే ఉంటుందని వేములవాడ అర్బన్ మండలం కొడిముంజ ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన శ్రీకృష్ణ కురుమ, యాదవ సంఘం సభ్యులు ప్రకటించారు. పట్టణంలోని చల్మెడ నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన యాదవ సోదరుల ఆత్మీయ సమావేశంలో ముకుమ్మడిగా ప్రకటించారు. బండ రాజు, గుంటి మల్లయ్య, బండ నాగయ్య, గుంటి నాగరాజు, చిగుర్ల లస్మయ్య, పట్టెంల కనకయ్య, గుంటి మహేష్, గుంటి తిరుపతితో పాటు వంద మంది సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఇంటింటా ప్రచారం

కోనరావుపేట: మండలంలోని రామన్నపేట, పల్లిమక్త, మామిడిపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. మామిడిపల్లిలో చల్మెడ కూతురు నిహారిక ఇంటింటా తిరుగుతూ ప్రచారాన్ని నిర్వహించారు. ప్రచారంలో ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య, సర్పంచుల ఫోరం కన్వీనర్ గోపు పర్శయ్య, బీఆర్ఎస్ అధ్యక్షుడు మల్యాల దేవయ్య, మాజీ సర్పంచులు పన్నాల విజయ, ఒగ్గు లావణ్య, తాటకార్ల సుమలత, ఉప్పుల శ్రీనివాస్, నాయకులు నేరెళ్ల జ్యోతి, వినోద, సంధ్య, కొక్కుల రాజు పాల్గొన్నారు.

గెలిచిన ఆరు నెలల్లోనే ఆరు పథకాల అమలు

- వేములవాడ కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్


పార్టీలో చేరిన యువ న్యాయవాదితోపాటు ఇతర నాయకులతో కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్

వేములవాడరూరల్: గెలిచిన ఆరు నెలల్లోనే ఆరు పథకాలను అమలు చేస్తామని వేములవాడ కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ అన్నారు. ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. వేములవాడ రూరల్ మండలం బొల్లారం, లింగంపల్లి, మల్లారం, మర్రిపల్లి గ్రామాల్లో శుక్రవారం రాత్రి ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. పండుగలకు పబ్బాలకు వచ్చే పోయే వాళ్లలాగా ఎన్నికల సమయంలోనే కొత్త నాయకులు కనిపిస్తున్నారని విమర్శించారు. ఏళ్లుగా ప్రజల మధ్యలోనే ఉంటూ కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్న తనకు ఓటువేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ప్రచారంలో మాజీ ఎంపీపీ రంగు వెంకటేశ్, సామ వకుళాభరణం శ్రీనివాస్, సామ తిరుపతిరెడ్డి, సాగరం వెంకటస్వామి, చిలుక ప్రభాకర్, చెరుకు శంకర్, దుమాల ఆదిరెడ్డి, నర్సయ్య, రవి, శ్రీనివాస్, రొండి రాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన యువన్యాయవాది శ్రీకాంత్

వేములవాడ: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కార్యాలయంలో యువన్యాయవాది సిరిగిరి శ్రీకాంత్‌తోపాటు 100 మంది యువకులతో కలిసి కాం


ర్యాలీలో పాల్గొన్న ఆది శ్రీనివాస్

గ్రెస్ పార్టీలో చేరారు. వీరికి కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ పార్టీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఇంటింటా కాంగ్రెస్ ప్రచారం

కోనరావుపేట: మండలంలోని శివంగాలపల్లి, బావుసాయిపేట, ఎగ్లాస్‌పూర్‌లో కాంగ్రెస్ నాయకులు ప్రచారాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, ఎంపీటీసీ యాస్మిన్ పాషా, నాయకులు రాంరెడ్డి, ధర్మేంధర్, పుట్ట రోహిత్, మాజీ రాములు, కొలకాని శ్రీనివాస్, ఎక్కల్‌దేవి శ్రీనివాస్, బైరగోని నందూ, ఇల్లెందుల శివ, దినాకర్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఓటర్ స్లిప్పుల పంపిణీ


ఓటర్ స్లిప్పులు అందజేస్తున్న మున్సిపల్ సిబ్బంది

వేములవాడ: ఎన్నికల సమీపిస్తుండటంతో అధికారులు తమతమ ఏర్పాట్లలో మునిగితేలుతున్నారు. ప్రభుత్వ హైస్కూల్‌లో సామాగ్రి, కాలేజీ తరగతి గదుల్లో ఈవీఎంలు భద్రపరిచారు. స్పెషల్ బలగాలతో భద్రత చర్యలు చేపడుతున్నారు. జిల్లా పోలీసు అధికారులు, స్పెషల్ ఎన్నికల అధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు. ఈ క్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల స్లిప్పులు, పోల్ చిట్టీలు, ఓటు ఎలా వేయాలో సూచించే కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. పట్టణంలోని 28 వార్డులలో శుక్రవారం ఈ ప్రక్రియ కొనసాగింది.

ఓటరు స్లిప్పులపై క్యూఆర్ కోడ్

గంభీరావుపేట: ఈసారి అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల సంఘం ఓటరు స్లిప్పులను సరికొత్తగా ముద్రించింది. గతంలో మాదిరిగా కాకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఓటరు స్లిప్పులపై ఫొటోల స్థానంలో 'క్యూఆర్ కోడ్'ను అందుబాటులోకి తెచ్చింది. ఓటరు ఫొటోను అధికారులు క్యూఆర్ కోడ్‌కు అనుసంధానం చేశారు. స్లిప్పు వెనుక భాగంలో పోలింగ్ బూత్ రూట్ మ్యాప్‌ను ముద్రించారు. గ్రామాల్లో బూత్ లెవల్ ఆఫీసర్లు(బీఎల్‌వో) ఇంటింటికీ తిరిగి కొత్త ఓటరు స్లిప్పులను పంపిణీ చేస్తున్నారు. అదేవిధంగా ఓటరులో అవగాహన పెంపొందించేందుకు ఎన్నికల సంఘం నూతనంగా ఓటరు గైడ్‌ను ముద్రించింది. దాంతో పాటు అవగాహన కరపత్రాలను అందిస్తున్నారు. ఓటరు నమోదుకు అర్హత, ఆన్‌లైన్ ప్రక్రియ, యాప్‌లు, పోస్టల్ బ్యాలెట్, ఓటరు ప్రతిజ్ఞ, ఓటు వేసే విధానం తదితర అంశాలపై కరపత్రాల్లో వివరించారు.

నాకు ఓటేస్తే మోదీని బలపర్చినట్లే

- వేములవాడ బీజేపీ అభ్యర్థి డా.చెన్నమనేని వికాస్‌రావు


బీజేపీ అభ్యర్థి వికాస్‌రావుకు గొర్రె పిల్లను అందిస్తున్న గ్రామస్తులు

వేములవాడరూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో తనకు ఓటు వేస్తే దేశాభివృద్ధిలో అగ్రగామిగా ఉన్న ప్రధాని మోదీని బలపర్చినట్లేనని వేములవాడ బీజేపీ అభ్యర్థి డా.చెన్నమనేని వికాస్‌రావు అన్నారు. శుక్రవారం వేములవాడ రూరల్ మండలం బొల్లారం, హన్మాజిపేట, జయవరం, మల్లారం, లింగంపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో చెన్నమనేని కుటుంబం నుంచి సేవలు అందించిన విషయాన్ని గుర్తు చేశారు. భవిష్యత్‌లో నియోజకవర్గ అభివృద్ధి కోసం పాటు పడుతూనే పల్లె ప్రజల వికాసానికి కృషి చేస్తానని వివరిస్తూ ఓట్లను అభ్యర్థించారు.

పతి కోసం సతి ప్రచారం

వేములవాడ: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన చెన్నమనేని వికాస్‌రావును గెలిపించాలని కోరుతూ ఆయన సతీమణి డాక్టర్ దీప పట్టణంలోని 11వ వార్డులో ఇంటింటికి తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. ఆమె వెంట కౌన్సిలర్ ఉమారాణి, నాయకులు రాపెల్లి శ్రీధర్, అన్నారం శ్రీనివాస్ ఉన్నారు.

సొంతగూటికి కౌన్సిలర్ గడ్డమీది లావణ్య శ్రీనివాస్

వేములవాడ మున్సిపల్ కౌన్సిలర్ గడ్డమీది లావణ్య శ్రీనివాస్ శుక్రవారం తిరిగి బీజేపీలో చేరారు. వీరికి పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామ


ప్రచారంలో వికాస్‌రావు సతీమణి డాక్టర్ దీప

కృష్ణ, పార్టీ అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావు పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు. వారి వెంట కుమ్మరి శంకర్, రేగుల సంతోష్‌బాబు, రేగుల మల్లికార్జున్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ప్రచారం

కోనరావుపేట: మండలం కనగర్తి, నాగారం, కోనరావుపేటలో బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. చెన్నమనేని వికాస్‌రావుకు ఎలాంటి పదవి లేకున్నా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారని, ఎమ్మెల్యే అయితే మరిన్ని కార్యక్రమాలు చేపడుతారన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేందర్‌రావు, రామచంద్రం, సురేశ్, బెంద్రం శ్రీనివాస్‌రెడ్డి, పోగుల లచ్చిరెడ్డి, స్వామి పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రత్యేక బలగాల కవాతు


తంగళ్లపల్లి మండలంలో కవాతు నిర్వహిస్తున్న ప్రత్యేక బలగాలు

తంగళ్లపల్లి/బోయినపల్లి: ఎన్నికల నేపథ్యంలో పలు గ్రామాల్లో కేంద్ర బలగాలతో కలిసి పోలీసులు శుక్రవారం కవాతు నిర్వహించారు. బోయినపల్లి మండలంలోని మాన్వాడ, మల్లాపూర్, వెంకట్రావుపల్లి గ్రామాల్లో సీఐ కృష్ణకుమార్, ఎస్సై శ్రీకాంత్, తంగళ్లపల్లి మండలంలో బద్దెనపల్లి, రామన్నపల్లి, బస్వాపూర్, బాలమల్లుపల్లె, నర్సింహులపల్లె, చిన్నలింగాపూర్, సారంపల్లి గ్రామాల్లో ఎస్సై వి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాలతో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అందరూ సహకరించాలని శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వయోజనులందరూ తమ ఓటుహక్కు వినియోగించుకుని పోలింగ్ శాతం పెరిగేలా చూడాలన్నారు. ప్రత్యర్థుల ఎన్నికల ప్రచారాలను ఆటంకపరిచినా, అడ్డగించినా కేసులు నమోదు చేస్తామని తెలిపారు. సోషల్ మీడియాలో అనుచిత వాఖ్యలు పోస్ట్ చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రత్యేక బలగాలు పాల్గొన్నారు.

హరిత మేత



సిరిసిల్లటౌన్: ఆహ్లాదాన్ని పంచుతున్న పచ్చని పార్కులు ఇలా పశువులకు మేత స్థలాలుగా మారుతున్నాయి. సిరిసిల్ల పట్టణంలోని పార్కుల నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారనడానికి ఇదో ఉదాహరణ. పట్టణంలోని పలుపార్కుల్లో పశువులు యథేచ్ఛగా పచ్చని చెట్లను పశువులు మేస్తున్నాయని చెబుతున్నారు. పార్కుల రక్షణ చర్యలపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపైనే వారసంత

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో నడిరోడ్డుపైనే వారసంత నిర్వహిస్తున్నారు. ప్రతి శుక్రవారం నిర్వహించే సంతకు ప్రత్యేక స్థలం కేటాయించాలని ప్రజలు చేసిన విజ్ఞప్తులు బుట్టదాఖలయ్యాయి. రోడ్డుపై వారసంతతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రోజంతా ఈ దారిని మూసివేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక గిద్దె చెరువు ప్రాంతంలో స్థలం కేటాయించినా, అక్కడ సంతను ఏర్పాటు చేయలేక పోతున్నారు. ఇప్పటికైనా సంతకు స్థలాన్ని కేటాయించాలని కోరుతున్నారు.

బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్

ముస్తాబాద్: మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ముస్తాబాద్‌కు చెందిన పుల్లూరి శ్రీనివాస్‌ను నియమిస్తూ రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు ఉత్తర్వులను శుక్రవారం అందజేశారు. బీసీ ఐక్యతకు, హక్కుల సాధనకు శ్రీనివాస్ కృషి చేయాలని కోరారు. మాజీ సర్పంచ్ ద్యావతి పండరి తదితరులున్నారు.